
# గొప్ప మనసు చాటుకున్న శ్లోక స్కూల్ విద్యార్థులు

## - పునర్విక చికిత్స కోసం రూ. 12001 విరాళం




ఇది కద నిజం, కుక్కునూరు: మండల కేంద్రంలోని శ్లోకా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు మరోసారి గొప్ప మనసును చాటుకున్నారు. అరుదైన ఎస్ఎమ్ఏ టైప్ 1 (SMA Type-1) వ్యాధితో పోరాడుతు పునర్విక (11 నెలలు) ప్రాణాలను కాపాడేందుకు తెలుగు ప్రజలు భారీ స్థాయిలో కదిలి వచ్చిన విషయం తెలిసిందే. చిన్నారి చికిత్స కోసం సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కుక్కునూరు మండల కేంద్రంలోని శ్లోక కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు కూడా పునర్విక కోసం చిన్న వయసులోనే పెద్ద మనసుతో ఆలోచించి ముందడుగు వేశారు. ఇందులో భాగంగానే పాఠశాలలోని విద్యార్థులంతా కలిసి రూ. 12001 (పన్నెండు వేల ఒక్క రూపాయలు) విరాళాలు సేకరించారు.



ఈ మొత్తాన్ని పాఠశాల యాజమాన్యం ఫోన్ పే ద్వారా బుధవారం పునర్విక తండ్రి సురేష్ కుమార్ బ్యాంకు ఖాతాకు పంపించింది. చిన్నారి ప్రాణాన్ని కాపాడడంలో తమ వంతు సహకారం అందించిన శ్లోక స్కూల్ విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యాన్ని, టీచర్లను, తల్లిదండ్రులను మండలంలోని అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు అభినందిస్తున్నారు.

# నిరుపేద క్రీడాకారునికి చేయూత

## క్రీడలకు ప్రోత్సాహం అందించిన భాగిర్తిపేట సర్పంచ్ తిరుపతి గౌడ్



భూపాలపల్లి, ఇది కద నిజం : గ్రామీణ ప్రాంతాల నుంచి వెలుగులోకి వస్తున్న ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రేగొండ మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు పసుల రాజుకు భాగిర్తిపేట గ్రామం సర్పంచ్ పెరుమాండ్ల తిరుపతి గౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. స్వయంకృషితో క్రికెట్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయికి ఎదుగుతున్న పసుల రాజు క్రీడా ప్రయాణానికి ప్రోత్సాహంగా రూ.5,000 నగదు అందించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ యువతలో అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, మార్గదర్శనం లభిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకిగా మారకుండా సమాజం ముందుకు వచ్చి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, ఆరోగ్యవంతమైన జీవనశైలి పెంపొందుతాయని పేర్కొంటూ యువత క్రీడల వైపు మరింతగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. క్రీడా రంగంలో కష్టపడి సాధన చేస్తున్న పసుల రాజు భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ క్రీడాకారులకు స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, సంఘాలు కలిసి మద్దతు ఇస్తే మరిన్ని ప్రతిభలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.డి. షబ్బీర్, భారతీయ జనతా పార్టీ భాగిర్తిపేట అధ్యక్షుడు దొడ్ల రత్నాకర్, గౌడ సంఘం అధ్యక్షుడు మెరుగు బాపు, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ఆర్ఎంపి మండల అధ్యక్షుడు సత్తెనపల్లి శ్రీధర్, వార్డ్ సభ్యుడు బాలాజీ రాజు తదితరులు పాల్గొని యువ క్రీడాకారునికి శుభాకాంక్షలు తెలిపారు.

# కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆకస్మిక తనిఖీలు

## విద్య,వైద్య సదుపాయాలపై దృష్టి





భూపాలపల్లి పలిమేల ఇది కద నిజం: భూపాలపల్లి జిల్లాలో ప్రభుత్వ విద్యా, ఆరోగ్య సదుపాయాల పనితీరును మెరుగుపర్చే దిశగా మయాంక్ సింగ్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించబడ్డాయి. తనిఖీలలో భాగంగా ఆయన ముందుగా పంకెన గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంను సందర్శించి విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌ను స్వయంగా తనిఖీ చేసి, మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలనే విషయంపై సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నివాస పాఠశాలల్లో విద్యతో పాటు భద్రతా ప్రమాణాలు కూడా కచ్చితంగా అమలులో ఉండాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలిమెల మండలంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ భవనం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సీ) భవనాల పనుల పురోగతిని పరిశీలించారు. పనుల నాణ్యత, గడువులపై వివరాలు అడిగి తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి పవన్, ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మరియు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# రాజీవ్ నగర్ చౌరస్తాలో రహదారి గుంతల సమస్యపై సిఐటియు నాయకుల డిమాండ్





హైదరాబాద్ ఫిబ్రవరి 25 ఇది కద నిజం: జోన్ సమన్వయకర్త రాపర్తి అశోక్ రాజీవ్ నగర్ చౌరస్తాలో తీవ్రంగా ఏర్పడిన రహదారి గుంతల కారణంగా వాహనదారులు, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారి మొత్తం చెరువులా మారి గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్రవాహన దారులు కిందపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ సమన్వయకర్త రాపర్తి అశోక్ మాట్లాడుతూ, రాజీవ్ నగర్ చౌరస్తాలోని ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని, వెంటనే నూతన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పురపాలక కమిషనర్ తక్షణమే స్పందించి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని హెచ్చరించారు. కేవలం మరమ్మతులు కాకుండా పూర్తి స్థాయిలో మళ్లీ తారు వేయాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా మురుగు కాలువ వ్యవస్థను సరిచేయాలని, ప్రమాద సూచిక ఫలకాలు ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేశారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిఫ్, నబీ బాబా తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకు అరుదైన గౌరవం

## అంతర్జాతీయ పార్లమెంటరీ బాధ్యత

### ఇండియా-సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా ఎంపికైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హన్మకొండ ఫిబ్రవరి 25 ఇది కద నిజం : వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యకి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా–సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యని లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ (కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ బ్రాంచ్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశం – సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు లోక్‌సభ స్పీకర్‌కి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. భారత్––సౌదీ అరేబియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ నామినేషన్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి గర్వకారణమని, అంతర్జాతీయ పార్లమెంటరీ వేదికపై తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తుందని ఎంపీ అభిప్రాయపడ్డారు.



1/1

LOK SABHA SECRETARIAT

Fax: 23010756 (Conference and Protocol Branch) Parliament House Annexe New Delhi-110001

No. 35/04/2026/C&P 23 February, 2026

From
L.V. Ramana,
Director
To
Dr. Kadiyam Kavya,
MP, Lok Sabha

Subject: Constitution of India- Saudi Arabia Parliamentary Friendship Group.

Respected Madam,

I am directed to state that a Parliamentary Friendship Group has been constituted in our Parliament with Saudi Arabia for the period of the 18th Lok Sabha.

2. In this connection, the Hon'ble Speaker, Lok Sabha is pleased to nominate you as a Member of the India-Saudi Arabia Parliamentary Friendship Group.

Yours faithfully,

DIRECTOR
Phone: 23035148/5611
Email:ipuc-lss@lss.sansad.in

# రేగొండలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేత కార్యక్రమం

## మహిళా అధ్యక్షురాలిగా సాధు అనిత శ్రావణ్ నియామకం



భూపాలపల్లి, ఇది కద నిజం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పార్టీ బలోపేత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో భాగంగా రేగొండ మండల టీఆర్పీ మహిళా అధ్యక్షురాలిగా సాధు అనిత శ్రావణ్‌ను నియమించగా, పలు స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను సమర్థిస్తూ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యతతో ప్రజాస్వామ్య పరిపాలనను నెలకొల్పడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో 2028లో పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యమని, బీసీ వర్గానికి చెందిన ముఖ్యమంత్రిని రాష్ట్రానికి అందించడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో తొలి ఎమ్మెల్యే స్థానాన్ని సాధించేందుకు క్షేత్రస్థాయిలో గడపగడపకు ప్రచారం చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. "మేము ఎంతో -- మాకు అంత" అనే నినాదంతో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా చాటి చెప్పాలని కోరారు. పార్టీ ప్రధాన మేనిఫెస్టోలో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైట్ టు రీకాల్ అమలు, భూమిలేని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల భూమి పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే లక్ష్యమని రవి పటేల్ తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.

# నాగర్ కర్నూల్ ఘటనపై ఐద్వా నిరసన

సత్తుపల్లి, ఫిబ్రవరి 25 ఇది కద నిజం: బుధవారం సత్తుపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం అనుబంధ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ఘటనపై ప్లకార్డులు చేతభూనీ నిరసన చేపట్టారు. కొమ్మర మల్లన్న జాతరకు వెళ్ళి దైవ దర్శనానికి వెళ్లిన రజక కుటుంబం పై అగ్రకుల పెద్దలు దాడి చేసి పసికందును కాళ్ళతో తన్ని నేలకోసి కొట్టి చిన్నారి మరణానికి కారణమైన దోషులను కఠినశీగా శిక్షించాలని ఐద్వా డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల, మత, వర్ణ, లింగ భేదాల ద్వేషాలను ప్రభుత్వం ప్రోత్సహించడం సరి కాదని ఆమె మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శీలం కరుణ, రాయల రాణిరుద్రమదేవి, నాగమణి, పుష్పవల్లి తదితరులు పాల్గొన్నారు.



